సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

బుధవారం। 26 । ఫిబ్రవరి । 2025



అదనపు చార్జీలు వసూలు చేస్తే చర్యలు

వంట గ్యాస్ సరఫరా సమయంలో వినియోగదారుల నుంచి అదనపు చార్జీలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని జేసీ అదితి సింగ్ హెచ్చరించారు. -8లో



లిఫ్ట్ ఇచ్చినట్లు నటించి..

బస్సు కోసం వేచి ఉన్న ఓ ఉపాధ్యాయురాలికి లిఫ్ట్ ఇస్తాం రమ్మంటూ కారులో ఎక్కించుకుని వెళ్లి ఆమె మెడలోని బంగారు గొలుసును చోరీ చేసిన ఉదంతమిది. -8లో

గరిష్టం/కనిష్టం
34.2/19.9

వాతావరణం

జిల్లాలో మంగళవారం 19.9 - 34.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

తొండూరు ఎంఎల్‌సీఓ సర్వీసు నుంచి తొలగింపు

కడప సెవెన్‌రోడ్స్: నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని తేలడంతో తొండూరు మండల లెవెల్ కో ఆర్డినేటర్ ఎం.చంద్ర ఓబులేశును సర్వీసునుంచి తొలగిస్తూ కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బద్వేలు, పులివెందుల డీఎల్‌డీఓల విచారణ నివేదిక ఆధారంగా ఆయన ఈ చర్య తీసుకున్నారు. 15వ ఆర్థిక సంఘ నిధుల్లో రూ. 22,62,888 దుర్వినియోగానికి పాల్పడినట్లు విచారణలో తేలింది. దీంతో ఆయనను సర్వీసు నుంచి రిమూవ్ చేయడంతోపాటు క్రిమినల్ కేసు నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

యాక్సిస్ బ్యాంకు లిమిటెడ్‌లో ఉద్యోగ అవకాశాలు

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఏపీ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు శిక్షణతో నిమిత్తం లేకుండా యాక్సిస్ బ్యాంకు లిమిటెడ్ సంస్థలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా గ్రామీ ణాభివృద్ధి సంస్థ జాబ్స్ మేనేజర్ హరప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు ఈనెల 28న రాజంపేటరోడ్డులో గల టీటీడీసీ భవనంలోఎంపికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జూనియర్ ఆఫీసర్, బీడీఈ, బీడీఏ ఉద్యోగాలకు రెగ్యులర్ డిగ్రీ చదివిన వారు అర్హులన్నారు. అభ్యర్థులు 28 ఏళ్లలోపు ఉండాలన్నారు. ఎంపికైన వారికి రూ. 2.2 నుంచి 3 లక్షల వరకు వార్షిక వేతనం ఉంటుందన్నారు. ఎంపికలు పర్సన్ ఇంటర్వ్యూ, ఆన్‌లైన్ అటిట్యూడ్ టెస్ట్, బిజినెస్ రౌండ్లుగా జరుగుతాయన్నారు. ఇంటర్వ్యూకు వచ్చేవారు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్/ఎల్ఎల్ఆర్, పాన్‌కార్డుతో హాజరుకావాలని సూచించారు.

పీహెచ్‌సీల తనిఖీ

తొండూరు: మండలంలోని మల్లేల, మడూరు గ్రామ ఆరోగ్య కేంద్రాలు, వాటి అనుబంధ గ్రామాలలో ప్రజలకు ముఖ్యంగా గర్భిణులకు, బాలింతలకు, బడి పిల్లలకు అందిస్తున్న ఆరోగ్య సేవలపై మంగళవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ జిల్లా గణాంకాధికారి రమేష్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలలో గర్భిణులకు అందిస్తున్న సేవలు, ఆర్థిక ప్రయోజనాలు తదితర సేవలపై నివేదికలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ అందరికీ ఆరోగ్య సేవలు వంద శాతం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. డాక్టర్ ఆరిఫుల్లా, జిల్లా నేషనల్ హెల్త్ మిషన్ అధికారులు నారాయణ, రాజ శేఖర్, అసిస్టెంట్ గణాంకాధికారి జాకబ్, పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు లేకుండా చూడాలి



మాధవరం-1 లోని జలజీవన్ మిషన్ స్కీంను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ ఓబులమ్మ

సిద్దవటం: వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని సిద్దవటం మండలంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని జెడ్పీ సీఈఓ ఓబులమ్మ తెలిపారు. సిద్దవటం మండలంలోని మాధవరం-1 లోని తాగునీటికి సంబంధించి జలజీవన్ మిషన్ స్కీంను మంగళవారం ఆమె పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఈఓ మాట్లాడుతూ తాగునీటి సమస్య వస్తే వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. గ్రామ పంచాయతీలో ఉన్న నిధులను ఎక్కువ శాతం ప్రజల తాగునీటి కోసం వాడుకోవాలన్నారు. తాగునీటి పైప్‌లైన్ లీకేజీ లేకుండా తనిఖీలు చేసి నీటిఎద్దడిని నివారించాలన్నారు.

సర్కార్ సొమ్ము దారి మళ్లింపు!

జమ్మలమడుగు రూరల్: విద్యుత్ శాఖ జమ్మలమడుగు సబ్ ఈఆర్వో కార్యాలయంలో విద్యుత్ బిల్లుల క్యాషియర్ సుజిత్ ట్రాన్స్‌కో సంస్థ ఖజానాకు జమ చేయాల్సిన సొమ్మును తన వ్యక్తిగతంగా వాడుకున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నెల 11న కడప ఎస్ఏఓ మధు కుమార్ విషయాన్ని పసిగట్టి కిందిస్థాయి అధికారులకు అప్రమత్తం చేశారు. ఈ విచారణలో అక్రమాలు నిర్ధారణ కావడంతో సుజిత్‌తో పాటు జేఏవోను అదే రోజు ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఉన్నతాధికారులు లోతుగా విచారించగా ఈ నెల 11 వ తేది వరకు రూ. 59,18,916 రూపాయలు స్వాహా చేసినట్లు తెలింది. దీంతో మరో ముగ్గురు అధికారులను గుర్తించి వారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ట్రాన్స్‌కో అధికారులు జమ్మలమడుగు పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఫిర్యాదుచేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ విషయమై పట్టణ సీఐ లింగప్పను వివరణ కోరగా ఇంకా కేసు నమోదు చేయలేదని.. దీనిపై విచారణ చేస్తున్నామని వివరించారు.

పులివెందులలో కోలాహలం

- అభిమాన నేత రాకతో అభిమానులు, కార్యకర్తల్లో ఉత్సాహం
- పురవీధుల్లో పర్యటించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- సంప్రదాయ నృత్యం చేసిన లంబాడీ మహిళలు



తనను కలవడానికి వచ్చిన అభిమానులు, ప్రజలు, కార్యకర్తలతో సెల్ఫీ తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప/పులివెందుల: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాకతో పులివెందుల పట్టణంలో కోలాహలం నెలకొంది. అభిమాన నేత పర్యటిస్తున్నారని తెలుసుకొని చిన్నారులు మొదలు పండు ముదుసలి వరకూ ఆయా రీతిలో అభిమానం ప్రదర్శిస్తూ రోడ్డుపైకి చేరారు. దారి పొడవునా నిలిచి జేజేలు పలికారు. ఆయనా అంతే.. వచ్చిన అభిమానులను, కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించారు. ప్రజల విజ్ఞప్తులను స్వీకరించారు. పార్టీ నేతలకు హితబోధ చేశారు. ప్రజాపక్షమే ఏకైక ఎజెండాగా ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల మదిలో వైఎస్సార్‌సీపీకి సుస్థిర స్థానముందని, ఎప్పటికీ ప్రజల పక్షమే అని ఎలుగెత్తి చాటాలని దిశా నిర్దేశం చేశారు. పట్టణంలోని మరో నలుగురు నూతన జంటలకు ఆశీర్వాదాలు అందించారు. పార్టీ నేత కుటుంబాన్ని పరామర్శించారు. ఇలా పర్యటన తొలి రోజంతా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బిజీబిజీగా గడిపారు.

లంబాడి మహిళల సంప్రదాయ నృత్యం

పులివెందుల పరిసర ప్రాంతాలకు చెందిన లంబాడి మహిళలు పెద్ద ఎత్తున మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆఫీసుకు చేరుకున్నారు. అభిమాననేతను చూసేందుకు గంటల తరబడి వేచి ఉన్నారు. కార్యాలయం ఆవరణలో లంబాడి సాంప్రదాయ నృత్యం చేశారు. వారి ఆటపాట పార్టీ కార్యకర్తలు, అభిమానులను ఆశ్చర్యపరిచింది. అభిమాన నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూడగానే కేరింతలు కొట్టారు.

ఇళ్లు దాటించిన అభిమానం

పులివెందుల పట్టణం కొండారెడ్డి కాలనీ చెందిన చిన్నారి మాబు షరీఫ్‌కు ఉన్న అభిమానం ఇళ్లు దాటి రింగురోడ్డుకు చేరేలా చేసింది. 5 కిలోమీటర్లు కాలినడక వచ్చి మాజీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలవాలని సుమారు 5గంటలు వేచి ఉన్నాడు. తొలుత ఆయన హెలిప్యాడ్ వద్ద దిగుతాడని తెలుసుకుని అక్కడే వెయిట్ చేశాడు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్కడకు చేరుకున్నారు. వేచి ఉన్న వారితో కలిసిపోయి ఎలాగైనా కలవాలనే ప్రయత్నం చేశాడు. ఎట్టకేలకు అభిమాన నేతను కలుసుకొని ఫొటో తీయించుకున్నారు.

అభిమాని ఆర్ట్ బహూకరణ

తన చిన్ననాటి ఫొటోపై చేయివేసి నిల్చొన్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్ట్‌ను ఓ అభిమాని బహూకరించి ఫొటో దిగారు. చూడముచ్చటగా ఉన్న ఆర్ట్ ఫ్రేమ్ వైపు మాజీ సీఎం వైఎస్ జగన్‌తోపాటు పార్టీ నేతలంతా చూస్తుండిపోయారు. అలాగే విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను ఇద్దరు విద్యార్థినులు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మెమోరాండం అందించారు.

అభిమానుల ఇళ్లకు వెళ్లిన మాజీ సీఎం

పులివెందుల పట్టణంలోని పలువురు అభిమానుల ఇళ్లకెళ్లి నలుగురు నూతన జంటలకు శుభాకాంక్షలు తెలియజేసి, ఆశీర్వదించారు. సింహాద్రిపురం మండలశాఖ అధ్యక్షుడు దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి తల్లి అనారోగ్యంతో ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఈసందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, డాక్టర్ సుధా, కడప మేయర్ సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యేలు ఎస్‌రఘురామిరెడ్డి, ఎస్‌బీఅంజద్ బాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఆర్టీసీ సంస్థ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, పులివెందుల మున్సిపల్ ఇన్‌చార్జ్ వైఎస్ మనోహర్‌రెడ్డి, పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హాఫీజ్, వేల్పుల రామలింగారెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ హాలు గంగాధరరెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, నాగేళ్ల సాంబశివారెడ్డి, మరకా శివకృష్ణారెడ్డి, బిదినంచర్ల బ్రహ్మానందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వైఎస్ జగన్ క్యాంప్ ఆఫీస్ వద్ద లంబాడీ మహిళల నృత్యం



అభిమాన నేతకు ఆర్ట్ బహూకరణ



విద్యార్థినుల సమస్యలు వింటున్న జననేత వైఎస్ జగన్



డి.లక్ష్మీనరసమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్ జగన్

శివోహం!

- నేడు మహాశివరాత్రి
- శైవ క్షేత్రాల్లో ఘనంగా ఏర్పాట్లు
- కొండ కోనలకు భక్తజనం





విద్యుద్దీప అలంకరణలో ప్రొద్దుటూరులోని ముక్తిరామలింగేశ్వర స్వామి ఆలయం

కడప కల్చరల్: శివుడు....భోళా శంకరుడు...భక్తవ శంకరుడు...ఆకు, పండు, పువ్వు, నీరు ఇలా ఏమిచ్చి మనసారా మొక్కినా భక్తులను కరుణిస్తాడు... వరాలు కురిపిస్తాడు.... ఆపదలో ఆదుకుంటాడు.... అందుకే ఆయన భక్తవ శంకరుడు. అలాంటి మహాశివరాత్రి భక్తులకు ఎంతో ముఖ్యమైనది. ఈ పండగను ఘనంగా నిర్వహించుకునేందుకు ఆలయాల్లో ఏర్పాట్లు చేసుకున్నారు. నిర్వాహకులు శివాలయాలను అందంగా తీర్చిదిద్దారు.

- జిల్లాలోని ప్రముఖ శివాలయాలు అందులోనూ అటవీ ప్రాంతాల్లో ఉన్న ఆలయాల సంఖ్య 15కు పైగానే ఉంది. ఒకప్పుడు ఈ జిల్లాలో శైవం బాగా విరాజిల్లింది. జిల్లాలో వీరశైవ ఆలయాలు ఉండడంతో అటు తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా శివరాత్రి సందర్భంగా భక్తులు ఈ జిల్లాకు వస్తుంటారు. పుష్పగిరి, చిట్వేలి, దేవుని కడప తదితర ప్రాంతాలలో శైవ, వైష్ణవాలయాలు పక్క పక్కనే ఉన్నాయి. నిత్యపూజ స్వామిని భక్తులు వైష్ణవ సంప్రదాయంలోనే అర్చిస్తారు. అడుగడుగునా గోవింద నామ స్మరణ చేస్తారు. ఇలా ఎన్నో విశిష్టతలు గల శివాలయాలున్న ఈ జిల్లాలో ఈ పండగను మరింత వైభవంగా నిర్వహిస్తారు. బుధవారం పండగ నిర్వహణకు భక్తులంతా ఉత్సాహంగా ఏర్పాట్లు చేసుకున్నారు.
- మహా శివరాత్రి సందర్భంగా జిల్లా అంతటా ముఖ్యంగా అటవీ ప్రాంతాల్లోని శైవ క్షేత్రాల్లో శివరాత్రి పూజలు నిర్వహించడానికి జిల్లా దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం ఉదయం నుంచే భక్తులు అటవీ క్షేత్రాల బాట పట్టారు. మొక్కులు గల భక్తులు ప్రత్యేక వాహనాలను ఉచితంగా ఏర్పాటుచేశారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. అటవీ ప్రాంతాల్లోని ఆలయాలకు వెళ్లేందుకు పలువురు భక్తులు ద్విచక్ర వాహనాలను ఉపయోగించడంతో దారులన్నీ రద్దీగా మారాయి. సాయంత్రానికి ఆయా క్షేత్రాలు భక్తులతో రద్దీగా మారాయి. నడక శ్రమ తెలియకుండా భక్తులు చేసే శివనామ స్మరణతో ఆయా క్షేత్రాలు మార్మోగాయి.

శివ పూజలకు ఏర్పాట్లు

శివరాత్రి సందర్భంగా అటవీ ప్రాంతాల్లోని శైవ క్షేత్రాల్లో శివయ్యకు విశేష పూజలు నిర్వహించనున్నారు. జిల్లాలో లక్షల మంది హాజరయ్యే క్షేత్రాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా పొలతల, నిత్యపూజస్వామికోన, అత్తిరాల, భైరవకోన, గుండాల కోన, కపర్థీశ్వర కోన, కన్యతీర్థం, భానుకోట తదితర ప్రాంతాలకు భక్తులు భారీగా హాజరవుతారు. అటవీ ప్రాంతాలతోపాటు గ్రామాలు, పట్టణాలు, కడప నగరంలోని శివాలయాలలో కూడా వైభవంగా నిర్వహించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. దాదాపు అన్ని ఆలయాలలో పండగ సందర్భంగా బుధవారం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేయనున్నారు. రాత్రి 8 గంటల నుంచి అర్ధరాత్రి వరకు భజనలు, ప్రవచనాలు, భక్తి గీతాలాపన చేయనున్నారు. అర్ధరాత్రి 12 గంటల నుంచి లింగోద్భవ కాలంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. మరికొన్నిచోట్ల జాగరణ చేసిన భక్తుల కోసం గురువారం ఉదయం కూడా అన్నదానం చేయనున్నారు.

నేడు బ్రహ్మంగారి కల్యాణ మహోత్సవం



విద్యుద్దీప అలంకరణలో బ్రహ్మంగారిమఠం

బ్రహ్మంగారిమఠం: భవిష్యత్ కాలజ్ఞాన ప్రబోధకర్త శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబల కల్యాణ మహోత్సవం బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ కల్యాణ ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొననున్నారు. బుధవారం ఉదయం 5గంటలకు వీరబ్రహ్మం సుప్రభాతం, నామసంకీర్తన, 8గంటలకు సహస్రనామార్చన, 12గంటలకు దీక్షాబంధనాలంకారోత్సవం ఉంటుందన్నారు. మధ్యాహ్నం నామసంకీర్తన భజనలు, సాయంత్రం 4గంటలకు సంగీత విభావరి , గుడి ఉత్సవం, సాయంత్రం మఠం ఆస్థాన కవి హైదరాబాదుకు చెందిన పెదపాటి నాగేశ్వరరావు చే ఉపన్యాసం, రాత్రి 9 వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబల కళ్యాణం , రాత్రికి హరి కథలు, గ్రామోత్సవం ఉంటాయని వివరించారు.

సింహ వాహనంపై వీరభద్రుడు



సింహ వాహనంపై ఆశీనులైన స్వామి, అమ్మవారు

రాయచోటి టౌన్: రాయచోటిలో శ్రీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం నవగ్రహ హోమం నిర్వహించారు. అనంతరం శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారిని యాలివాహనంపై ఊరేగింపు నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవారు సింహవాహనంపై విహరించారు. ఉత్సవమూర్తుల ప్రత్యేక అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. పురవీధుల్లో గ్రామోత్సవం ఉత్సాహ భరితంగా సాగింది. అడుగడుగునా భక్తులు కొబ్బరి కాయలు కొట్టి కనులారా దర్శించుకుని తన్మయులయ్యారు. భజన గురువు తుమ్మల హరినాథ ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్యస్వామి, కృష్ణయ్యస్వామి, శేఖర్ స్వామి, రాచరాయ యోగీస్వామి నేతృత్వంలో నిర్వహించారు.

అడవిలో అలజడి

- గజరాజుల బీభత్సం
- శేషాచలంలో ముగ్గురు మృత్యువాత
- జిల్లా చరిత్రలో తొలిసారిగా పెద్ద ఘటన
- గతంలో పీలేరు పరిధిలోని వ్యక్తిపై దాడి
- అడవికి ఆనుకునే ఉన్న గ్రామస్తులను వెంటాడుతున్న భయం



ఏనుగుల దాడిలో మృతి చెందిన వ్యక్తులు

సాక్షి రాయచోటి: అన్నమయ్య జిల్లాలో అలజడి రేగింది. పచ్చని చెట్ల మధ్య ఘీంకరిస్తూ ఏనుగులు చేసిన భయోత్పాతం ఆందోళన రేకెత్తించింది. శివయ్య దర్శనానికి వెళుతున్న భక్తులపై ఏనుగులు దాడి చేసి తుదముట్టించడంతో అలజడి రేగింది. ఇటీవల కాలంలో గజరాజుల ఘీంకారం ఎక్కువైంది. పంట పొలాల్లోకి రావడం.. అడవి సమీప గ్రామాల పరిధిలో అక్కడక్కడా కనిపిస్తుండటంతో అంతటా భయాందోళనలు నెలకొన్నాయి. అందులోనూ పెద్ద ఎత్తున గుంపుగా ఏనుగులు వస్తుండటం ఆందోళన కలిగించే పరిణామం. జిల్లా చరిత్రలో ఎప్పుడూ ఇంతటి పెద్ద ఘటన జరగలేదు. శేషాచలం అడవిలో ఒక్క సారిగా ముగ్గురిని ఏనుగులు పొట్టన పెట్టుకున్న సంఘటన జిల్లాలో కలకలం రేపింది.

పండుగ ముందు విషాదం: అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండలం వై. కోట ప్రాంతం నుంచి గుండాలకోనకు వెళ్లే దారి మధ్య నుంచి.. మరో వైపు తలకోనకు వెళుతుండగా పెద్ద ఘటన చోటుచేసుకుంది. పెద్ద ఎత్తున ఏనుగుల గుంపు ఒక్కసారిగా శేషాచలం అడవిలో దాడి చేయడంతో ముగ్గురు మృత్యువాత పడటం, ఇద్దరు గాయపడటం తెలిసిందే. అయితే శివరాత్రికి ముందు రోజు... తలకోన ప్రాంతంలో ఉన్న శివయ్య దర్శనానికి వెళుతున్న వీరిపై గజరాజులు దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందారు. పండుగ ముందు రోజు ఈ ఘటన చోటుచేసుకోవడంతో ఉర్లగడ్డపోడు ఎస్సీ కాలనీలోని బాధిత కుటుంబాల్లో విషాదం అలుముకుంది. శివరాత్రి పండుగను ఎంతో సంబరంగా.. నిర్వహించుకోవాలనుకున్న వారి పట్ల దేవుడు చిన్నచూపు చూడడంతో లబోదిబోమంటున్నారు.

తరుచూ పంట పొలాల్లోకి వస్తున్న వైనం

అన్నమయ్య జిల్లాలో ఇటీవల తరుచూ ఏనుగులు కనిపిస్తున్నాయి. ప్రధానంగా ఇటీవలి కాలంలో అటవీ సమీప గ్రామాల పరిధిలోని పొలాలు, తోటలను ధ్వంసం చేస్తున్నాయి. ప్రస్తుతం వేసవి కాలం ప్రారంభం కావడంతో.. నీరు, మేత కోసం కూడా గ్రామాలవైపు వస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఎప్పుడు ఏనుగులు వచ్చినా అలజడి సృష్టిస్తుండడంతో గ్రామాల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల పీలేరు, పుంగనూరు సరిహద్దు ప్రాంతాలతోపాటు రైల్వేకోడూరు మామండూరు ప్రాంతాల్లో కనిపించాయి.

గతంలో పలు ఘటనలు

అన్నమయ్య జిల్లాలో ఇటీవలి కాలంలో ఏనుగులు బెంబేలెత్తిస్తున్నాయి. గత ఏడాది అక్టోబరు 17న పీలేరు పట్టణం ఆటోనగర్ సమీపంలో రాజారెడ్డి అనే వ్యక్తిపై ఏనుగుల గుంపు తొక్కి దాడి చేసి చంపేశాయి. అంతకుముందు మదనపల్లె, కలికిరి పరిధిలో పంట పొలాలపై దాడి చేసి పెద్ద ఎత్తున నష్టం కలిగించాయి. ప్రస్తుతం ఓబులవారిపల్లె మండల పరిధిలోని శేషాచలం అడవిలో పెద్ద ఎత్తున ఏనుగుల గుంపు వచ్చి మనుషులను తొక్కి చంపివేయడంతో అటవీ సమీప గ్రామాల పరిధిలో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఎప్పుడు ఎలాంటి ఉపద్రవాలు ఎదుర్కోవాల్సి వస్తుందోనన్న ఆందోళన అటు గ్రామస్తులతోపాటు అటవీ ప్రాంతాల్లో తిరిగే ప్రజలను వెంటాడుతోంది.

కళ్ల ముందే నా భార్యను చంపేశాయి



మా గ్రామం నుంచి ఎనిమిది మంది కలిసి వెళ్లాము. రాత్రి భోజనం చేసిన తరువాత అర్ధగంట అడవిలో లైట్లు వేసుకొని నడచుకొంటూ ఒకరి వెనుక ఒకరు వెళ్తున్నాము. రాత్రి ఒంటి గంట సమయంలో ముందు వెళ్తున్న తిరుపతి చెంగలరాయుడు ఏనుగులు ఉన్నాయని గమనించాడు. ఈ విషయం మాకు ఎవరికీ చెప్పలేదు. అతని వద్ద ఉన్న టిఫిన్ క్యారియర్‌తో చప్పుడు చేశాడు. దీంతో ఏనుగుల గుంపు ఒక్క సారిగా వెనుదిరిగి.. చివరలో వస్తున్న నా భార్య మణెమ్మపై ఒక్కసారి దాడి చేశాయి. నా కళ్ల ముందే అక్కడికి అక్కడే చంపేశాయి. నేను పరుగులు తీసి పెద్ద చెట్టు చాటున దాక్కొన్నాను. అమ్ములు నా వెనకాలే వచ్చి చొక్కా పట్టుకొన్నది. చంపేస్తాయని అమ అమ్మాయిని చెట్టు చాటుకు లాగాను. అప్పడే గున్న ఏనుగు వచ్చి కాలును తొక్కడంతో కాలు విరిగింది. ఎలగోలా బతికి బయటపడ్డాము.

– తుపాకుల సిద్దయ్య, ఎస్టీ కాలనీ, రైల్వేకొడూరు మండలం

క్లుప్తంగా

కూలిన మట్టిమిద్దె



దువ్వూరు : మండల కేంద్రమైన దువ్వూరులోని దళితవాడలో సోమవారం అర్ధరాత్రి మట్టి మిద్దె అకస్మాత్తుగా కూలిపోయింది. వివరాలిలా.. దువ్వూరులోని దళితవాడలో బొంపెం రేణుక, భర్త నాగేంద్ర, ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నారు. కుటుంబ సభ్యులు గాఢ నిద్రలో ఉండగా అర్ధరాత్రి సమయంలో ముందుగా మట్టి పెళ్లలు పడడంతో కుటుంబ సభ్యులు భయంతో నిద్ర లేచి ఇంటి బయటకు వచ్చారు. వారు బయటికి వచ్చిన క్షణ కాలంలో మట్టి మిద్దె కూలిపోయింది. తమ అదృష్టం బాగుండటంతో ప్రాణాలతో బయటపడ్డామని బాధితులు భయందోళనతో చెప్పారు. కూలి పనులకు వెళితేనే తమ కుటుంబం గడుస్తుందని తాము నివాసం ఉండే ఇల్లు కూలిపోవడంతో తాము ఎక్కడ ఉండాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

గొడ్డుమర్రి ఆనకట్టను పరిశీలించిన సీఈ

లింగాల : గొడ్డుమర్రి రిజర్వాయర్ పికప్ ఆనకట్టను మంగళవారం నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసులు పరిశీలించారు. గత అక్టోబర్ 19న గొడ్డుమర్రి ఆనకట్ట మట్టి కట్ట వరదలకు కొట్టుకుపోయింది. దీని మరమ్మతుల నిర్వహణకు నిధులు కేటాయించాలని ప్రతిపాదనలు పంపేందుకు దెబ్బతిన్న మట్టి కట్టను ఆయన పరిశీలించారు. అనంతరం చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను పరిశీలించి స్థితిగతులను ఈఈ రాజశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. సీబీఆర్‌లో కుంగిన రివిట్‌మెంట్ ధ్వంసమైన రక్షణ గోడల నిర్మాణానికి గత ప్రభుత్వంలో సుమారు రూ.14కోట్ల నిధులు మంజూరయ్యాయని పనుల నిర్వహణకు అనుమతులు ఇవ్వాలని సీబీఆర్ ఈఈ రాజశేఖర్ ఈఈ శ్రీనివాసులుకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన మధుసూదన్ నాయుడు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామ సమీపంలో జరిగిన ప్రమాదంలో ట్రాక్టర్ ఢీకొని తిప్పలూరు మధుసూద్ నాయుడు(49) అనే వ్యక్తి మృతి చెందాడు. ఏఎస్ఐ గురుశంకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు పోట్లదుర్తి గ్రామంలో నివాసం ఉండే తిప్పలూరు మధుసూదన్‌నాయుడు ఎర్రగుంట్ల పట్టణంలో వైన్స్ షాపు నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి వైన్స్ షాపులో పని ముగించుకుని రాత్రి 10.30 గంటల సమయంలో బైకులో ఇంటికి బయలు దేరాడు. పోట్లదుర్తి గ్రామ సమీపంలోకి రాగానే ట్రాక్టర్ వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన అతన్ని వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించారు. అక్కడ మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి బంధువులిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ప్రొద్దుటూరులో గంజాయి గ్యాంగ్ ఆగడాలు

- జల్సాలకు అలవాటు పడిన యువకులు
- డబ్బు కోసం ఓ యువకుడిని కిడ్నాప్ చేసే ప్రయత్నం
- యువకుడిని రాత్రంతా చిత్రహింసలకు గురి చేసిన వైనం
- స్నేహితుడి సాయంతో ప్రాణాలతో బయట పడిన బాధితుడు
- ముగ్గురిపై కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు



జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆరిఫ్



ఆరిఫ్‌ను కొట్టడంతో శరీరంపై తీవ్ర గాయాలైన దృశ్యం

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులో ఇటీవల గంజాయి గ్యాంగ్ ఆగడాలు శ్రుతి మించిపోయాయి. జల్సాలకు అలవాటు పడిన యువకులు గంజాయిని విక్రయించడమే వృత్తిగా ఎంచుకున్నారు. మైనర్లు సైతం గంజాయిని తాగడంతో పాటు అక్రమంగా విక్రయిస్తున్నారు. వీరికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చినా ఫలితం కనిపించలేదు. ఈ క్రమంలో గంజాయికి అలవాటు పడిన కొందరు యువకులు డబ్బు కోసం స్నేహితుడని చూడకుండా కిడ్నాప్ చేసి చంపే ప్రయత్నం చేశారు. మూడు రోజుల క్రితం పలువురు గంజాయి బ్యాచ్‌కు చెందిన యువకులు ఆరిఫ్ అనే యువకుడిని విచక్షణా రహితంగా చితకబాదారు. అంతటితో ఆగక డబ్బు కోసం కిడ్నాప్, చంపే ప్రయత్నం కూడా చేయడంతో స్నేహితుడి సాయంతో అతను ప్రాణాలతో బయటపడగలిగాడు. ఈ సంఘటనపై ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

స్నేహితుడే కదా అని పిలిస్తే వెళ్లాడు..

షేక్ ఆరిఫ్ గ్యాస్ స్టవ్‌లు రిపేరు చేసుకొని జీవిస్తున్నాడు. అతని స్వస్థలం ప్రొద్దుటూరులోని అమృతానగర్. అయితే ఎర్రగుంట్లలో బంధువులు ఉండటంతో ఇటీవల అక్కడ స్థిరపడ్డాడు. ఆరిఫ్‌కు ప్రొద్దుటూరులో స్నేహితులు ఉన్నారు. అప్పుడప్పుడు వారి కోసం అతను వస్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం ప్రొద్దుటూరుకు వచ్చాడు. హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన నరేష్ అనే స్నేహితుడు మద్యం తాగేందుకు రమ్మని పిలవడంతో మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఆటోనగర్ సమీపంలోని ఓ ప్రైవేట్ స్కూల్ వెనుక వైపునకు వెళ్లాడు. అప్పటికే శ్రీనివాసనగర్‌కు చెందిన శ్రీనివాసులు, సంజీవనగర్‌కు చెందిన రమేష్‌తో పాటు మరి కొందరు యువకులు ఉన్నారు. అందరు కలిసి ఆరిఫ్‌ను చితకబాదారు. ముళ్ల కర్రలతో కొట్టడంతో తీవ్ర రక్తగాయాలు అయ్యాయి. బీరు సీసా తీసుకొని ఆరిఫ్ తలపై కొట్టారు. మూడు నెలల క్రితం గంజాయి కేసులో చాపాడు పోలీసులకు శ్రీనివాసులు, రమేష్‌లు పట్టుబడ్డారు. ఈ సమాచారాన్ని ఆరిఫ్ పోలీసులకు చెప్పి ఉంటాడనే అనుమానంతో అతన్ని చితకబాదారు. అతని వద్ద ఉన్న రూ. 4 వేలు లాక్కున్నారు. మరో రూ. 10 వేలు ఇస్తే వదిలేస్తాం.. లేదంటే చంపేస్తామని బెదిరించారు. అక్కడి నుంచి శ్రీనివాసనగర్‌లోని మిల్లు వద్దకు తీసుకెళ్లి ఆరిఫ్‌తో అతని స్నేహితుడైన చిన్నాకు వారు ఫోన్ చేయించారు. 'రేయ్ రూ. 10 వేలు ఉంటే ఫోన్ పే చేయ్ లేదంటే వీళ్లు నన్ను చంపేస్తారు' అని చెప్పాడు. ఆరిఫ్ ఎక్కడో సమస్యల్లో ఉన్నాడని భావించిన చిన్నా అకౌంట్‌లో డబ్బు లేదు.. ఎక్కడున్నావో చెబితే వచ్చి క్యాష్ ఇస్తానని చెప్పాడు. ఫలానా మిల్లు వద్దకు రమ్మని చెప్పడంతో చిన్నా అక్కడికి వెళ్లగా వారు కనిపించలేదు. మళ్లీ రాత్రి 9.30 గంటల సమయంలో చిన్నాకు ఆరిఫ్ ఫోన్ చేసి ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్‌లో ఉన్నా రాజమండ్రికి వెళ్తున్నాం అని చెప్పాడు. డబ్బు పంపాల్సిందిగా అడిగాడు. దీంతో అనుమానం వచ్చిన చిన్నా వారిలో ఒకరి నంబర్‌కు ఫోన్ చేసి 'ఆరిఫ్‌ను ఏం చేయొద్దు.. వదిలేయండి.. మీకు ఎంత డబ్బు కావాలన్నా నేను ఇస్తాను' అని చెప్పాడు. 'అతన్ని ఎప్పుడో వదిలేశాం.. మా వద్ద లేడని వాళ్లు చెప్పారు. అప్పుడు రాత్రి సుమారు 11 గంటలైంది. ఈ క్రమంలో శ్రీనివాసనగర్ నుంచి రామేశ్వరం రోడ్డులోని ఒక బార్ వద్దకు ఆరిఫ్‌ను తీసుకెళ్లారు. అక్కడ మద్యం తాగిన అనంతరం 11.45 గంటల సమయంలో ఆరిఫ్‌ను బైక్‌లో కూర్చోపెట్టుకొని తీసుకెళ్లారు. 'డబ్బు ఇస్తే ఇచ్చినట్లు లేదంటే దారిలో నిన్ను చంపేస్తాం' అని అతన్ని బెదిరించారు. ఈ క్రమంలోనే వనిపెంట సమీపంలోని ఆదిరెడ్డిపల్లె వద్దకు వెళ్లగా అక్కడ శుభకార్యం నిమిత్తం ఏర్పాటు చేసిన డీజేలో మహిళలు డ్యాన్స్ చేస్తున్నారు. వారిని చూసిన శ్రీనివాసులు బైక్‌ను ఆపాడు. డ్యాన్సర్లు తనకు పరిచయమని చెప్పి వారితో పాటు ఇద్దరూ డ్యాన్స్ చేశారు.

స్నేహితుడికి ఫోన్ చేసిన ఆరిఫ్

కిడ్నాపర్ల వద్దకు వెళ్లి కువైట్‌లో తనకు తెలిసిన వారు ఉన్నారని వారికి ఫోన్ చేస్తే ఫోన్‌పేలో డబ్బు వేస్తారని ఆరిఫ్ చెప్పాడు. వాళ్లు సరేనని చెప్పడంతో ఫోన్ తీసుకొని పక్కకు వెళ్లిన ఆరిఫ్ చిన్నాకు లొకేషన్‌తో పాటు వాయిస్ మెసేజ్ పంపించాడు. తిరిగి మెసేజ్ కానీ, ఫోన్ కానీ చేయవద్దని చెప్పాడు. అప్పుడు సమయం సోమవారం వేకువ జామున 3 గంటలు అయింది. దీంతో చిన్నా మరో స్నేహితుడిని వెంట తీసుకొని 45 నిమిషాల్లోనే సంఘటనా స్థలానికి వెళ్లాడు. కిడ్నాపర్లు ఇద్దరు డ్యాన్సర్లతో చిందులు వేస్తూ ఉండగా ఆరిఫ్‌ను తమ స్కూటీలో కూర్చోపెట్టుకొని అక్కడి నుంచి వచ్చేశారు. దారిలోనే డయల్ 100కు ఫోన్ చేసి జరిగిన విషయాన్ని పోలీసులకు తెలిపారు. అక్కడి నుంచి నేరుగా మైదుకూరు పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. తర్వాత మైదుకూరు సీఐతో మాట్లాడటంతో ఇరువురు కానిస్టేబుళ్లను ఆదిరెడ్డిపల్లెకు పంపించారు. అప్పటికే ఒక కిడ్నాపర్ పరారు కాగా.. మరో వ్యక్తిని స్టేషన్‌కు తీసుకొచ్చారు. తీవ్రంగా గాయపడిన ఆరిఫ్‌ను చిన్నా ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పరిశీలించిన వైద్యులు శరీరం లోపల కండరాలు బాగా దెబ్బతిన్నాయని, ఐదు రోజుల పాటు చికిత్స అవసరమని చెప్పారు. జరిగిన సంఘటనపై ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శ్రీనివాసులు, నరేష్, సురేష్‌లతో పాటు మరి కొందరిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్‌రఫి తెలిపారు. కేసును పూర్తి స్థాయిలో విచారణ చేస్తే గంజాయి రవాణాలో ప్రమేయం ఉన్న మరికొందరు బయటపడే అవకాశం ఉంది. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. నిందితులను వెంటనే పట్టుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

అదనపు చార్జీలు వసూలు చేస్తే గ్యాస్ ఏజెన్సీలపై చర్యలు

జాయింట్ కలెక్టర్ అదితిసింగ్



కడప సెవెన్‌రోడ్స్ : వంట గ్యాస్ సరఫరా సమయంలో వినియోగదారుల నుంచి డెలివరీ బాయ్స్ అదనపు చార్జీలు వసూలు చేస్తే సంబంధిత వంట గ్యాస్ ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు, లీగల్ మెట్రాలజీ, సివిల్ సప్లయిస్ డీటీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో జేసీ మాట్లాడారు. ఈ వారం ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా ఫిర్యాదులు అందాయని తెలిపారు. బిల్లుపై ఉన్న ధర కంటే ఎక్కువ వసూలు చేయరాదని ఆమె ఆదేశించారు. దీన్ని అతిక్రమిస్తే సంబంధిత గ్యాస్‌ఏజెన్సీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసి వారి వివరణ ఆధారంగా పెనాల్టీ విధిస్తామని హెచ్చరించారు. డెలివరీ బాయ్స్ తప్పనిసరిగా వేయింగ్ మిషన్ తీసుకెళ్లి వినియోగదారుని కోరిక మేరకు సిలిండర్‌ను తూకం వేసి ఇవ్వాలని చెప్పారు. జిల్లాలో దీపం సబ్సిడీ పడకపోతే వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీ వద్దకు వెళ్లి గ్యాస్ కనెక్షన్‌కు ఆధార్ అనుసంధానం ఈకేవైసీ ద్వారా చేయించుకోవాలని సూచించారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి అదృశ్యం



షేక్ అబ్దుల్ జలీల్ (ఫైల్)

కమలాపురం : కమలాపురం పట్టణం పకీరు వీధికి చెందిన షేక్ అబ్దుల్ జలీల్ అప్పుల బాధ తాళలేక ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు. జలీల్ భార్య రజియా తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. తన భర్త ఏడాదిన్నర క్రితం బైపాస్ సర్జరీ చేసుకున్నాడని, తమ వద్ద డబ్బు లేక పోవడంతో అప్పు చేసి ఆపరేషన్ చేయించుకున్నామని ఆమె తెలిపారు. ఆపరేషన్ చేయించుకోవడంతో ఏ పని చేయలేక తన భర్త ఇంటి వద్దనే ఉంటున్నాడని ఆమె అన్నారు. కాగా తన చిన్న కుమారుడు చదువు కుంటున్నాడని, పెద్ద కుమారుడితో కలసి టిఫిన్ సెంటర్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నానని తెలిపారు. ఈ నేపథ్యంలో అప్పులు ఇచ్చిన వారు తన భర్తను ఎక్కడ పడితే అక్కడ డబ్బులు ఇవ్వాలని తీవ్రంగా హెచ్చరిస్తుండటంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తన భర్త ఈ నెల 24వ తేదీన మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడన్నారు. సాయంత్రం 4.45 నిమిషాలకు వేరే నెంబర్‌తో ఫోన్ చేసి అప్పుల బాధ భరించలేక నేను ఇంటి నుంచి వచ్చేశానని, తన కోసం వెతకవద్దని కన్నీరు పెట్టాడని ఆందోళన వ్యక్తం చేశారు. 2–3 రోజుల్లో తన నుంచి ఫోన్ వస్తే బతికి ఉన్నట్లు అని, లేకపోతే చనిపోయానని అర్థం చేసుకోవాలని చెప్పాడన్నారు. ఎక్కడున్నావని అడుగుతుండగానే ఫోన్ కట్ చేశాడని, తిరిగి అదే నెంబర్‌కు తాను ఫోన్ చేస్తే ఎవరో ఫోన్ ఎత్తి అతను ఏడ్చుకుంటూ వెళ్లిపోయాడని, ఇది కడప పాత బస్టాండు అని తెలిపాడన్నారు. తన కుమారునితో కలసి కడప నగరం అంతా కలియ తిరిగామని, అయితే ఎలాంటి ఆచూకి లభించలేదని ఆమె పోలీసులను ఆశ్రయించారు. జలీల్ భార్య రజియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కమలాపురం పోలీసులు తెలిపారు.

చోరీ కేసులో ముగ్గురు బాలురు అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని కామనూరు గ్రామంలో ఒక దుకాణంలో చోరీ చేసిన ఘటనలో ముగ్గురు బాలురను మంగళవారం అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్ఐ మహమ్మద్‌రఫి తెలిపారు. పట్టణంలోని జిన్నారోడ్డు, అమృతానగర్, ప్రకాష్‌నగర్‌కు చెందిన ఈ ముగ్గురు బాలురలో ఇద్దరు ఇటీవల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో, బద్వేల్‌లో జరిగిన చోరీ కేసుల్లో నిందితులని ఎస్ఐ చెప్పారు. ఈ క్రమంలోనే కామనూరులోని ఒక దుకాణంలో రూ.12వేలు నగదు దొంగిలించారన్నారు. వీరి వద్ద నుంచి రూ. 12వేలు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించామని ఎస్ఐ వివరించారు.

ఆక్రమిత భూముల క్రమబద్ధీకరణ

డీఆర్ఓ విశ్వేశ్వర నాయుడు

కడప సెవెన్‌రోడ్స్ : అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల ఆక్రమణల క్రమబద్ధీకరణపై ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం–2025 పేరుతో భూముల క్రమబద్ధీకరణకు మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెంబర్ 30 జారీ చేసిందని డీఆర్ఓ విశ్వేశ్వర నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్ని క్రమబద్ధీకరిస్తారన్నారు. నివాస గృహాలు నిర్మించడం ద్వారా చేసిన ఆక్రమణలు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారన్నారు. మాస్టర్ ప్లాన్, జోనల్ ప్లాన్‌లో నిర్దేశిత స్థలాలు, లేఅవుట్ స్థలాలు, కాలువలు, నదీ ప్రవాహ గట్లు, ఇతర జలవనరులకు సంబంధించిన స్థలాల్లో క్రమబద్ధీకరణ చేయరన్నారు. ఆర్సీసీ రూఫ్/ఆల్బెస్టాస్ రూఫ్‌ను ఇటుక గోడలతో నిర్మించి ఉండవచ్చన్నారు. క్రమబద్ధీకరణకు రిజిస్టర్డ్ డాక్యుమెంట్, ఆస్తి పన్ను చెల్లింపు, విద్యుత్తు బిల్లు, వాటర్ బిల్లులను ఆధారంగా పరిగణనలోకి తీసుకుంటారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2019 అక్టోబరు 15ను కటాఫ్ డేట్‌గా తీసుకుందని, ఆ తేదీ కంటే ముందు ఆక్రమించిన ప్రభుత్వ భూమిని నివాస గృహం నిర్మించుకున్నవారికి నిబంధనలు అనుసరించి భూముల్ని క్రమబద్ధీకరిస్తారన్నారు. ఈ క్రమబద్ధీకరణ పట్టాలను మహిళల పేర్లపైనే జారీచేస్తారని తెలిపారు. 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తారని, 301 గజాల కంటే ఎక్కువ భూమి ఆక్రమణలో ఉంటే సాధారణ రిజిస్ట్రేషన్ విలువతోనే క్రమబద్ధీకరిస్తారన్నారు. ఈ క్రమబద్ధీకరణకు దరఖాస్తులను 2025 డిసెంబర్ 31వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో స్వీకరిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని అర్హులైన వారు దరఖాస్తు చేసుకొని కంప్యూటర్ జనరేటెడ్ రశీదును పొందాలన్నారు. వీటిపై గ్రామ వీఆర్ఓ, వార్డు అధికారులు విచారణ జరిపి ఆయా ప్రాంతాలను బట్టి తహసీల్దార్, ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్లకు నివేదికలు ఇస్తారని తెలిపారు. వాటిని సబ్ డివిజనల్ కమిటీలో చర్చించి ఆమోదిస్తారన్నారు. ఆ తర్వాత లబ్ధిదారుల ఎంపికపై ఆదేశాలు ఇస్తారని, వాటి ఆధారంగా తహసీల్దార్ కన్వేయెన్స్ డీడ్ల రూపంలో క్రమబద్ధీకరణ ఉత్తర్వులు ఇస్తారన్నారు. రెండేళ్ల తర్వాత లబ్ధిదారులకు ఆ భూములపై శాశ్వత హక్కులు ఇస్తారని డీఆర్ఓ ఆ ప్రకటనలో తెలిపారు.

రెవెన్యూ సదస్సు అర్జీలను పరిష్కరించండి

జేసీ అదితి సింగ్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అదితి సింగ్

కమలాపురం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై సమీక్ష చేశారు. ఎన్ని అర్జీలు వచ్చాయి? అర్జీల్లో సమస్యలు ఎక్కువగా ఏమి ఉన్నాయి? ఇప్పటి వరకు ఎన్ని అర్జీలు పరిష్కరించారు? పెండింగ్‌లో ఎన్ని ఉన్నాయి? అని సంబంధిత అధికారులతో ఆరా తీశారు. నిర్ణీత గడువులోగా అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా అర్జీలను పరిష్కరించాలన్నారు. ఆ సమస్యలు తిరిగి పునరావృతం కాకూడదన్నారు. మండల కేంద్రాల్లో సమస్యలు పరిష్కరిస్తే జిల్లా కేంద్రాలకు అర్జీదారులు ఎందుకు వస్తారు అని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిధిలోని సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీఓ ఎర్విన్, తహసీల్దార్ శివరామిరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ అలంకరణల వద్ద జాగ్రత్తలు పాటించాలి

విద్యుత్ శాఖ ఎస్ఈ ఎస్.రమణ



కడప కార్పొరేషన్ : మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా ఏర్పాటు చేసే పందిళ్లను విద్యుత్ లైన్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు అతి సమీపంలో వేయడం వలన విద్యుత్ ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎస్. రమణ హెచ్చరించారు. మంగళవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ అలంకరణలకు ఉపయోగించే విద్యుత్ వైర్లు అతుకులు లేకుండా నాణ్యతను నిర్ధారించుకోవాలన్నారు. విద్యుత్ లైన్లకు దూరంగా పందిళ్లు వేసుకోవాలని సూచించారు. సాధ్యమైనంత వరకు పందిళ్లకు ఇనుప పైపులకు బదులు కొయ్యలు లేదా ప్లాస్టిక్ పైపులు ఉపయోగించుకోవాలన్నారు. ఉత్సవ ఊరేగింపులు చేసేటప్పుడు విద్యుత్ లైన్ల వద్ద జాగ్రత్తగా ఉండాలన్నారు. అవసరమైతే విద్యుత్తు సిబ్బంది సహకారం తీసుకుని వారితో విద్యుత్ ఆపు చేయించుకొని ముందుకు సాగాలన్నారు. ఒక చిన్న నిర్లక్ష్యం పెను ప్రమాదాన్ని సృష్టిస్తుందన్నారు. భద్రతా నియమాలను పాటించి విద్యుత్ ప్రమాదాలను అరికట్టి మహాశివరాత్రి పర్వదినాన్ని సంతోషంగా గడపాలని సూచించారు.

లిఫ్ట్ ఇచ్చినట్లు నటించి.. బంగారు గొలుసు కత్తిరించి..



బాధితురాలిని విచారిస్తున్న బద్వేలు రూరల్ సీఐ

బి.కోడూరు : బస్సు కోసం వేచి ఉన్న ఓ ఉపాధ్యాయురాలికి లిఫ్ట్ ఇస్తాం రమ్మంటూ కారులో ఎక్కించుకుని వెళ్లి ఆమె మెడలోని బంగారు గొలుసును చోరీ చేసిన ఉదంతమిది. వివరాలు ఇలా.. స్థానిక కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న వరలక్ష్మి మంగళవారం సాయంత్రం 4 గంటల సమయంలో పాఠశాల సమయం ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు మండలంలోని కాసానగరం, ఐత్రంపేట గ్రామాల సమీపంలో రోడ్డుపై బస్సు కోసం వేచి ఉంది. ఇదే సమయంలో కారులో వెళుతున్న కొంత మంది వాహనం ఆపి తాము పోరుమామిళ్లకు వెళుతున్నాం, వస్తారా అని అడిగారు. మోసాన్ని గమనించని ఉపాధ్యాయురాలు కారులో ఎక్కారు. కొంత దూరం వెళ్లే సరికి వారి ప్రవర్తనపై అనుమానం వచ్చి కారు ఆపి దిగి చూసుకోగా మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసు కత్తిరించి దొంగిలించినట్లు గుర్తించారు. ఈ మేరకు బద్వేలు రూరల్ సీఐ నాగభూషణ్‌కు ఫిర్యాదు చేశారు. సీఐ సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆయన వెంట బద్వేలు రూరల్ ఎస్ఐ శ్రీకాంత్, ఎస్బీ కానిస్టేబుల్ జయరామిరెడ్డి, బి.కోడూరు పోలీసులు ఉన్నారు. అనంతరం సీఐ మీడియాతో మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తుల వాహనాలలో ఎక్కితే ఇలాంటి సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. గుర్తు తెలియని వ్యక్తులతో పరిచయాలు పెంచుకోవడం, వారి వెంట లిఫ్ట్ అడగడం మంచిది కాదని తెలిపారు.

రైతుల ఆత్మహత్యపై ఆర్డీఓ విచారణ



లంకా వీరయ్య కుటుంబాన్ని విచారిస్తున్న ఆర్డీఓ సాయిశ్రీ

దువ్వూరు : మండలంలోని పెద్ద జొన్నవరం, జిల్లెల్ల గ్రామాలకు చెందిన లంకా వీరయ్య, డీటీ చంద్రశేఖర్ గత ఏడాది ఆగస్టు నెలలో అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనలపై బుధవారం ఆర్డీఓ సాయిశ్రీ, వ్యవసాయశాఖ ఏడీ కృష్ణమూర్తి, తహసీల్దార్ అక్బల్ బాషాలతో కలసి రైతు కుటుంబాలను ఆత్మహత్యలకు గల కారణాలపై విచారించారు. వారి కుటుంబ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఆర్డీఓ సాయిశ్రీ మాట్లాడుతూ.. రైతుల ఆత్మహత్యలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించి వీరి కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమీక్ష నిర్వహించి రీ సర్వే జరుగుతున్న తీరుపై రైతుల నుంచి వచ్చే అభ్యంతరాలపై పలు సూచనలు చేశారు.

మోటార్ సైకిళ్ల దొంగ అరెస్టు



మోటార్‌సైకిళ్ల దొంగ అరెస్ట్ వివరాలను తెలియజేస్తున్న కడప టూటౌన్ సీఐ నాగార్జున

కడప అర్బన్ : కడప నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో మోటార్ సైకిళ్ల చోరీకి పాల్పడుతున్న దొంగను కడప టూటౌన్ సీఐ బి. నాగార్జున, తమ సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. నిందితుడి దగ్గరి నుంచి 9 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం సీఐ మాట్లాడుతూ కడప నగరంలోని గంజికుంటకాలనీకి చెందిన షేక్ గౌస్‌బాషా నగరంలో తిరుగుతూ పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను చోరీ చేసి వాటిని విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం వచ్చిందన్నారు. కడప డీఎస్పీ ఏ. వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఎస్ఐలు ఎస్‌కేఎం హుసేన్, సిద్దయ్యలతో కలిసి అరెస్టు చేసి 9 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

రాజంపేట టౌన్ : ఈనెల 22వ తేదీ పట్టణంలోని సబ్‌స్టేషన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తుమ్మల అగ్రహారానికి చెందిన గూడూరు శేషమరాజు అలియాస్ బండి శేషయ్య మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

ప్రొద్దుటూరు క్రైం : గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. రైల్వేస్టేషన్ సమీపంలో కొందరు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో మంగళవారం రూరల్ ఎస్ఐ మహమ్మద్‌రఫి సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడిలో పట్టణానికి చెందిన కిరణ్‌కుమార్, గురుదర్శన్ అనే వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

10 మంది జూదరుల అరెస్ట్

నిమ్మనపల్లి : వేర్వేరు చోట్ల పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి 10 మంది జూదరులను అరెస్ట్ చేసి వారి నుంచి 32 వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని రాచవేటివారిపల్లె, నిమ్మనపల్లెలో పేకాట స్థావరాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. రాచవేటివారిపల్లె గ్రామంలో నిర్వహించిన దాడిలో ఎస్.రాజశేఖర్‌రెడ్డి, జి.శ్రీనివాసులు, పి.రెడ్డిశేఖర్, ఎం.స్వామినాథ, ఏ.రాజశేఖర్‌రెడ్డి, వై.నజీర్‌లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.27,870 స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే నిమ్మనపల్లెకు సమీపంలో జూదం ఆడుతున్న కర్ణాటకకు చెందిన బీసీ ఆదినారాయణ, సైదాపేటకు చెందిన మహమ్మద్ రఫీ, కర్ణాటక బాగేపల్లెకు చెందిన శంకర, నిమ్మనపల్లె దిగువవీధికి చెందిన మదన్‌లాల్‌సింగ్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.4,140 స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసులు నమోదుచేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు.

విషపు మొక్కలు తిని 20 మేకలు మృతి



విషపు మొక్కలు తిని మృతి చెందిన మేకలు

సిద్దవటం : మండలంలోని మిట్టపల్లె గ్రామానికి చెందిన ఓబయ్య అనే మేకల కాపరికి చెందిన 20 మేకలు విషపు మొక్కలు తిని మృతి చెందాయి. బాధితుడి కథనం మేరకు ఓబయ్య తన మేకలను మంగళవారం గ్రామ సమీపంలో ఉన్న పంట పొలాల్లోకి మేపు కోసం తీసుకెళ్లాడు. మధ్యాహ్నం 12 గంటలకు మేకలను ఇంటికి తోలుకొనిరాగా ఇంటి వద్ద నీళ్లు తాగగానే మృత్యువాత పడ్డాయి. మేకల విలువ దాదాపు రూ. 2లక్షలు ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరాడు. మృతి చెందిన మేకలను భాకరాపేట పశువైద్యాధికారి డాక్టర్ శివశంకర్ పరిశీలించి వైద్య పరీక్షల నిమిత్తం జిల్లా పశుసంవర్ధక శాఖ ల్యాబ్‌కు పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని పంట పొలాల్లో ఉన్న విషపు మొక్కలను తిని మృతి చెందినట్లు ల్యాబ్ పరీక్షల్లో తేలిందన్నారు. రైతుకు జరిగిన నష్టాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు.

నేడు ఆలయాల్లో పూజలు నిలిపివేస్తూ అర్చకుల నిరసన



రామసముద్రం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అర్చకులు

రామసముద్రం : రామసముద్రంలోని ప్రధాన ఆలయాల్లో మహాశివరాత్రి పర్వదినాన పూజలు నిలిపివేసి నిరసన తెలుపనున్నట్లు మంగళవారం అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్. నడింపల్లి పంచాయతీ బల్లసముద్రం కొండపై వెలసిన శ్రీ వాలీశ్వర స్వామికి పూర్వం నుంచి వంశపారంపర్యంగా ప్రధాన అర్చకులుగా లోకనాథ దీక్షిత్ కొనసాగేవారన్నారు. అయితే గ్రామానికి చెందిన పలువురు అర్చకుడిని తొలగిస్తున్నట్లు చెప్పడంతో అర్చకులు హై కోర్టులో పిటిషన్ వేయగా అనుకూలంగా తీర్పు వచ్చింది. దీనిపై సోమవారం సాయంత్రం మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడు, ఈఓ రమణ, కమిటీ సభ్యులతో కొండపై సమావేశం ఏర్పాటు చేసి లోకనాథ దీక్షిత్ లు ఉత్సవాల్లో కొనసాగేలా నిర్ణయించారు. అయితే ఉత్సవ కమిటీ సభ్యులు లోకనాథ దీక్షిత్‌ను కాకుండా కర్ణాటకకు చెందిన అర్చకులను నియమించారు. దీనిపై రామసముద్రం మండలంలోని అర్చకులు లోకనాథ దీక్షిత్ కు మద్దతుగా మండలంలోని అన్ని ఆలయాల్లో పూజలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే అర్చకుడు లోకనాథ దీక్షిత్ కొండ కింద బుధవారం మౌన దీక్ష చేయనున్నట్లు తెలిపారు. వీరికి బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు.